# జన్మ తరించాలంటే స్వార్థాన్ని త్యజించాలి

**నిద్దురనుండి లేచి మరి నిద్దుర పోయెడుదాక పొట్టకై**
**హద్దును పద్దు లేక వ్యయమందగ చేయుచు జీవితంబు నీ**
**విద్దెల ధారపోసి అరవింద దళాక్షుని విస్మరించి ఏ**
**పెద్ద సుఖంబు నొందితివొ ప్రీతిగ యోచన చేయు మానవా!**

ఇన్ని విద్యలు నేర్చి, ఇంత గొప్ప పేరు పొంది మానవత్వమును మరచిపోతే ఏమి ప్రయోజనము! మానవత్వమును మరచినవాడు ఎన్ని విద్యలు నేర్చినా అవన్నీ వ్యర్థమేగాని, సార్థకము కావు. ఏ మానవునియందైనా కించిత్ ప్రేమ, కించిత్ దయ, కించిత్ త్యాగము ఉన్నవా? ఇవి లేనప్పుడు ఇంక మానవత్వమునకు విలువేమిటి! 'జంతూనాం నరజన్మ దుర్లభం' అనడంలో అర్థమేమిటి! ఏమి చేసినా, ఏమి చూసినా కేవలం తన పొట్ట నిమిత్తమై ప్రాకులాడుతున్నాడేగాని, సమాజ సంక్షేమమును గురించి, లోకకల్యాణమును గురించి మానవుడు ఏమాత్రమైనా చింతిస్తున్నాడా? సమాజ శ్రేయస్సుకోసం పాటుపడేవాడే నిజమైన వ్యక్తి. ఈనాటి మానవుడు సాటి వ్యక్తిని మానవునిగా గౌరవించడం లేదు. ప్రాకృతమైన పదవులను చూసి గౌరవిస్తున్నారేగాని, మానవునియొక్క హృదయ గౌరవాన్ని ఏమాత్రము గుర్తించడం లేదు. పదవికి గౌరవము నందిస్తున్నారేగాని, వ్యక్తిగతమైన శక్తికి గౌరవమును అందించటం లేదు. పదవి ఈరోజు ఉంటుంది, రేపు పోతుంది. కాని, మానవత్వము నిత్యసత్య నిర్మలమైనటువంటిది. ఇట్టి నిత్యసత్యమైన తత్త్వాన్ని గుర్తించుకోవడానికి మానవుడు ఈనాటికికూడను ఏమాత్రము ప్రయత్నించటం లేదు.

ఇక్కడ యజ్ఞములో పాల్గొన్న ఋత్విక్కులందరూ ఎంతో శ్రద్ధగా, ఎంతో భక్తిగా పారాయణము గావిస్తూ తమతమ కార్యక్రమములను నిర్వహిస్తూ వచ్చారు. వారు చిన్నవయస్సునుండియే చక్కగా ప్రాక్టీసు చేస్తూ రావడంచేత ఈనాటికి ఇంత గొప్ప శక్తి వారికి ప్రాప్తించింది. పూర్వకాలంలో తల్లులు తమ పిల్లలకు చిన్నతనమునుండి చక్కని

sri sathyasai vachanamrutam

అలవాట్లు నేర్పించేవారు. 'కొక్కొరోకోయని కోడి కూయగనే నిద్దురనుండి లేచి, పళ్ళు తోముకొని, స్నానమాచరించు. భగవంతుని స్మరించు. ఆ తరువాతనే నీవు ఆహారము తీసుకో', అని బోధించేవారు. కాని, ఈనాటి పిల్లలు తెల్లవారు ఝామున లేవటం లేదు. బాగా ప్రొద్దెక్కిన తరువాత ఎనిమిది గంటలకో, తొమ్మిది గంటలకో లేస్తున్నారు. లేచిన తక్షణమే మొహం కూడా శుభ్రము చేసుకోకుండా కాఫీ, టీలు త్రాగుతున్నారు. ఎప్పుడు చూసినా తమ పొట్టనుగురించి యోచిస్తున్నారేగాని, జీవితమును ధన్యము చేసుకునే మార్గమునుగురించి యోచించటం లేదు.

**జ్ఞానమే నిజమైన సంపద**

ఎన్ని విద్యలు నేర్చినప్పటికీ, ఎంత ధనము సంపాదించినప్పటికీ మానవునిలో త్యాగమనేది కనిపించటం లేదు. ఇంకా ఆశలు పెరుగుతూనే ఉన్నాయి. పది బిల్డింగులు కట్టినప్పటికీ పదకొండవది కావాలని ఆశిస్తున్నాడు. బిజినెస్‌లో కోట్లాది రూపాయలు గడించినవారుకూడా ఇంకా తమ బిజినెస్‌ను పెంచుకోవాలని చూస్తున్నారు. ఇంక ఎప్పుడు తాము తరించేది? మనము తరించుటకై జన్మించినామేగాని సిరిసంపదలకోసం ప్రాకులాడుతూ మానవ జీవితమును వ్యర్థము చేయుటకు కాదు. జీవితము ఏవిధముగానైనా జరిగిపోతుంది. మానవునికి నిజమైన సంపద జ్ఞానమే! ఆత్మజ్ఞానము అత్యవసరం. ఆత్మజ్ఞానము లేనివానికి ఎన్ని విద్యలున్నను అవన్నీ నిరుపయోగమే! జ్ఞానమనగా తెలియని విషయాలను తెలుసుకోవడం కాదు. మీ హృదయమునందున్న భావాలను మీరు గుర్తించాలి. అదే నిజమైన జ్ఞానము. మీరు ఎన్ని కోట్లు సంపాదించినప్పటికీ కట్టకడపటికి అవన్నీ వదలిపెట్టి వట్టి చేతులతోనే పోక తప్పదు. కనుక, జన్మను తరింపజేసుకోవడానికి కృషి చేయాలి. జీవ బ్రహ్మైక్యానుసంధానమునకై ఆత్మజ్ఞానము అవసరము.

గడచిన పన్నెండు దినములనుండి ఋత్విక్కులు ఎంతో ఆనందంగా భగవన్నామస్మరణ చేస్తున్నారు. ఇలాంటి సదవకాశము తిరిగి మనకు లభిస్తుందా అని మీరు విచారించాలి. ఆస్తిపాస్తులు వస్తాయి, పోతాయి. కాని, జ్ఞానము వస్తే తిరిగి పోయేటటువంటిది కాదు. అది వస్తుంది, పెరుగుతుంది. ఈవిధంగా పెరిగే జ్ఞానమును సంపాదించటానికి మనం

sri sathyasai vahamrutam

ప్రయత్నించాలి. శరీరము క్రుంగిపోయినప్పటికీ మానవునికి ఆశలు మాత్రం తీరటం లేదు. మొట్టమొదట మనము కోరికలను అరికట్టుకోవాలి. అప్పుడే మానవుడు మానవునిగా జీవించగలడు. మానవునియందు ఉండవలసిన లక్షణాలు ఈనాడు కనిపించటం లేదు. సత్యమేమైనా చెపుతారా? లేదు. నోరెత్తితే అబద్ధమే! ప్రతి కార్యమునందు అధర్మానికి పాల్పడుతున్నాడు. ఇంక శాంతి ఏరీతిగా లభిస్తుంది? శాంతి ప్రపంచంలో ఎక్కడైనా షాపులందు చిక్కుతుందా? నో, నో! బయట చిక్కేది కాదు, శాంతి. ఏనాడు నీవు కోరికలను అరికట్టుకుంటావో ఆనాడు శాంతి నీనుండే ఆవిర్భవిస్తుంది. అప్పుడే నిజమైన ప్రేమ నీయందు ప్రారంభమవుతుంది. ఇప్పుడుకూడా ప్రేమ నీయందున్నది. ప్రేమ ఎప్పటికీ మరణించేది కాదు. 'నో డెత్ ఫర్ లవ్!' ప్రతి వ్యక్తియందు ప్రేమ ఉంది. కాని, ఈ ప్రేమను 'ఆర్టిఫీషియల్'గా వినియోగిస్తున్నారు.

ప్రేమస్వరూపులారా! మీరందరూ ప్రేమనే ధరించాలి, ప్రేమనే వరించాలి, ప్రేమనే అనుభవించాలి, ఆనందించాలి. ఎవరి హృదయమునందు ప్రేమ ఆవిర్భవిస్తుందో వాడే నిజమైన మానవుడు. ఈనాడు అందరుకూడను ప్రేమతో ఉన్నట్లు కనిపిస్తారు. కాని, ఆచరణలో ప్రేమను అనుభవించడం లేదు. మీదగ్గర పది రూపాయలుంటే మీకు అవసరమైనది మీదగ్గర పెట్టుకోండి; మిగిలినది పరోపకారార్థం వినియోగించండి. భగవంతుని ఆస్తిలో అందరికీ equal share ఉంది. ఈ share ను మనము సరియైనరీతిగా వినియోగించుకొనకపోతే మన స్వార్థము మనలను చంపుతుంది.

**స్వార్థంకోసం కాదు, లోకకల్యాణంకోసం ప్రార్థించు**

మేఘాల్లో ఉన్న జలము మన నోటి కందుతుందా? అందదు. వర్షంగా కురిసినప్పుడే ఆ జలమును మనము అందుకొని త్రాగడానికి వీలౌతుంది. ఆ మేఘాలలో ఉన్న నీరు మనకు కావాలనుకున్నప్పుడు దానికి తగిన ప్రార్థన చేయాలి. వరుణుడి అనుగ్రహం కలిగినప్పుడే మనకు వాటర్ లభిస్తుంది. భగవంతుడు జలమును ప్రసాదించినది కేవలం మన స్వార్థంకోసం కాదు; లోకకల్యాణంకోసం. లోకశాంతిని మనము కోరాలి. కేవలం నీకు, నీ కుటుంబానికి, నీ బంధువులకు మాత్రం శాంతి కావాలని స్వార్థంతో ప్రార్థించకూడదు. నీవు,

srisathyasai vahini / vachanamrutam

నీ కుటుంబము మాత్రమే శాంతిగా ఉంటే సరిపోదు; ప్రపంచానికంతటికీ శాంతి కావాలి. శాంతి అనేది 'లోకాస్సమస్తా స్సుఖినో భవంతు' అనే ప్రార్థనలో ఇమిడియున్నది. అందరూ భగవంతుని బిడ్డలే! అందరూ క్షేమంగా, సుఖంగా ఉండాలి. అందరి సుఖమే నా సుఖము. మీరందరూ శాంతి, సంతోషాలతో ఉండటం, దైవచింతన చేయటం... ఇదే నాకు శాంతి, ఇదే నాకు సుఖము.

**లోకశాంతికోసమే అతిరుద్ర మహాయజ్ఞము**

ప్రేమస్వరూపులారా! ఈ అతిరుద్ర మహాయజ్ఞము లోకకల్యాణముకోసము చేసినటువంటిదే కాని, ఏదో ఒక వ్యక్తికోసం చేసినటువంటిది కాదు. అందరూ ఆనందము ననుభవించాలి. లోకానికి శాంతి కలగాలి. లోకానికి శాంతి లేనప్పుడు నీలోపల శాంతి ఎట్లా కలుగుతుంది! కనుక, లోకశాంతి నిమిత్తమై మీరందరూకూడను ప్రార్థనలు చేయండి. అతిరుద్ర మహాయజ్ఞమును చక్కగా జరిపినందుకు ఈ చెన్న పట్టణములో అందరూ ఆనందిస్తున్నారు. సర్వనదులూ సముద్రములో ఏకమైనట్లుగా అతిరుద్ర యజ్ఞములో సర్వక్షేమములు, సర్వకర్మలు, సర్వసంతోషములు, సర్వసుఖములు, సమస్త లోకశాంతికూడను ఇమిడి యున్నవి. ఈ అతిరుద్ర మహాయజ్ఞములో ఉచ్చరించే మంత్రములు మీకు తెలియకపోయినను వినడంలోకూడా ఎంతో ఆనందమున్నది. దేనిని శ్రవణం చేశారో దానిని మననం చేయండి. మననం చేసినదానిని ఆచరణలో పెట్టండి. అప్పుడే మీకు తగిన శాంతి చేకూరుతుంది. అంతేకాని, పుట్టినది మొదలుకొని గిట్టునంతవరకు మీరు పొట్టకై ప్రాకులాడుతుంటే ఇంక తరించేదెప్పుడు! పుట్టినటువంటివాడు చావక తప్పదు. కాని, చచ్చేంతవరకుకూడను మంచి కార్యములు చేయకపోతే ఇంకెప్పుడు చేస్తారు! మీకు మంచి ఆరోగ్యము, శక్తి, ఇంద్రియ బలము ఇవన్నీ ఉన్నప్పుడే మీరు మంచి కార్యములకు పూనుకోవాలి.

**చిన్నతనమునుండే దైవచింతన ప్రారంభించాలి**

చూడండి, ఇక్కడ ఉన్నటువంటి ఋత్విక్కులలో చాలామంది యువకులే! వాళ్ళు ఎప్పటినుండి వేదం నేర్చుకున్నారు? చిన్నతనములోనే 'ఓం నమశ్శివాయ' అనే పంచాక్షరీ

sri sathyasai vachanamrutam

మంత్రముతో దీనిని ప్రారంభించారు. ఆవిధముగా చిన్నతనమునుండియే మనము దైవచింతన ప్రారంభించినప్పుడే మనకు చక్కని గురువులు, చక్కని స్నేహితులు లభ్యమౌతారు. నీవు చెడ్డవారితో చేరి మంచివాడవు కావాలనుకుంటే అవుతావా? ఎప్పటికీ కావు. సత్సంగంలో చేరినప్పుడే నీవు మంచివాడవు కాగలవు. మనము మంచివారనే పేరు తెచ్చుకోవాలి. మానవుడు మంచివాడు; పశువులాంటివాడు కాదు. కాని, ఈనాటి మానవుడు మానవునివలె కాక కీచకునివలె ప్రవర్తిస్తున్నాడు. కీచకునివలె కాదు, మనము అర్జునునివలె ఉండాలి. అనగా, చిత్తశుద్ధి కలిగి, పవిత్రమైన ప్రేమతో ఎట్టి ఆశలూ లేకుండా జీవించాలి. స్వార్థాన్ని త్యాగం చేయాలి. త్యాగమంటే ఏమిటి? నిత్యానిత్యవిషయ పరిశీలన చేసి అనిత్యమును విసర్జించాలి.

ప్రేమస్వరూపులారా! మీరింతకాలము యజ్ఞము చేసినందుకు, పవిత్రమైన మంత్రములను శ్రవణం చేసినందుకు ఇదంతా సార్థకమైపోయింది. మీరందరూ ఇక్కడ కూర్చుని పవిత్రమైన మంత్రాలను శ్రవణం చేస్తుంటే నేనిక్కడికి వచ్చే సమయంలో బజారంతా జనులు 'సాయిరాం, సాయిరాం, సాయిరాం....' అని భగవన్నామాన్ని స్మరిస్తున్నారు. సతతం దైవచింతన చేయాలి. ఇదే నిజమైన భక్తి. మనము తెలుసుకున్నటువంటిదానిని కొంతవరకైనా ఆచరణలో పెట్టాలి. అప్పుడే మన జన్మ సార్థకమవుతుంది.

**(అతిరుద్ర మహాయజ్ఞం 2007, తేదీ 30.1.2007, తిరువాన్మియూర్ (చెన్నై)**

sri sathyasai vachanamrutam